AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

15-6-2026 (Monday) MAIN EDITION

## ఇరాన్‌తో అమెరికా ఒప్పందం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తలు తగ్గుముఖం పట్టనున్నాయి. కొంతకాలంగా బాంబుల మోతతో దద్దరిల్లిన ప్రాంతాల్లో శాంతి వెల్లివిరియనుంది. ఈ మేరకు ఇరాన్-అమెరికా మధ్య ఒప్పందం ఖరారైంది. 'ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది. అందరికీ అభినందనలు!( అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మూడు నెలలకు పైగా సాగిన ఘర్షణకు ముగింపు పలికేలా, అమెరికా- ఇరాన్ ఒక ఒప్పందానికి వచ్చాయని, అలాగే లెబనాన్‌తో సహా అన్ని రంగాలలో సైనిక కార్యకలాపాలకు "తక్షణ, శాశ్వత" ముగింపు ఉంటుందని ట్రంప్ ప్రకటించారు. అయితే ఈ శాంతి ఒప్పందాన్ని అంగీకరించేలా వాషింగ్టన్‌ను టెహ్రాన్ (ఇరాన్) బలవంతం చేసిందని ఇరాన్ ప్రభుత్వ టీవీ పేర్కొంది.

## దేశ సమగ్రతే జనసేన లక్ష్యం..: పవన్ కల్యాణ్



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ రాజధానిలో 'సేన ప్రస్థానం దేశ సమగ్రత కోసం సేనా ప్రస్థానం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలను, గత రాజకీయ పరిస్థితులను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ సమగ్రతను కాపాడడమే జనసేన ప్రధాన సిద్ధాంతమని, దేశ స్ఫూర్తిని దేశవ్యాప్తంగా తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకే కార్యక్రమాన్ని ఢిల్లీ వేదికగా నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటును ఎప్పుడూ వ్యతిరేకించలేదని, రాష్ట్ర విభజన జరిగిన తీరునే తాము తప్పుబట్టామని వివరించారు.

## బ్రెజిల్‌లో విషాదం.. రెండు హెలికాప్టర్లు ఢీ..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: బ్రెజిల్ దేశంలోని రియో డి జెనిరో గగనతలంలో ఘోర ప్రమాదం జరిగింది. రెండు హెలికాప్టర్లు గాలిలోనే ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రముఖ అమెరికన్ సింగర్ ఒలివర్ ట్రీతో సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అందరినీ షాకింగ్‌కు గురిచేసింది.

## టీవీ నటి సంచిత ఆత్మహత్య



అక్షరటుడే, ముంబై: టీవీ నటి సంచిత ఉగాలే ముంబైలోని తన నివాసంలో ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఆమె ఉరేసుకుని విగతజీవిగా కనిపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 'కుంకుమ భాగ్య' సీరియల్‌తో సంచిత మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## అమెరికా-ఇరాన్ ఒప్పందం.. స్వాగతించిన మోదీ



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలకడం ప్రపంచానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రధాని 'ఎక్స్' వేదికగా స్పందించారు.

## జర్మనీలో ఉపాధి అవకాశాలు : మంత్రి వివేక్




**అక్షరటుడే, హైదరాబాద్:** జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గమని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా యువత అంతర్జాతీయ స్థాయిలో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. జర్మనీలో ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత కోసం టామ్‌కామ్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో జర్మనీలో మంచి వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

**హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. మెట్రో ప్రాజెక్టును అడ్డుకునేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు.**

- అక్షరటుడే, హైదరాబాద్



# మెట్రో ఫేజ్-2పై కుట్ర

- నిధులు రాకుండా అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి
- కేటీఆర్‌తో కుమ్మక్కు
- సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

మెట్రో రెండో దశ పనులు ప్రారంభం కావాలంటే, మొదటి దశను ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. మెట్రోను నడపడం వల్ల ఏటా రూ.400 కోట్ల నష్టాలు వస్తున్నాయని, తాము ఇక ఈ ప్రాజెక్టులో కొనసాగలేమని ఎల్ అండ్‌టీ తేల్చి చెప్పిందని వివరించారు. ఎల్‌అండ్ టీని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో, ఆస్తులను కొనుగోలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. యూపీ మెట్రో ఎండీ సుశీల్ కుమార్ పర్యవేక్షణలో, రూ.30 వేల కోట్ల విలువైన ఎల్ అండ్‌టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు.

### కిషన్‌రెడ్డిపై విమర్శలు

మెట్రో ప్రాజెక్టు కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి 4 శాతం వడ్డీకే రుణం పొందేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని, రూ.84 కోట్ల పేపర్ ఫీజుతో పాటు రూ.1400 కోట్ల ఈక్విటీని కూడా చెల్లించామని సీఎం చెప్పారు. అయితే, రుణం మంజూరయ్యే సమయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడ్డారని ఆయన ఆరోపించారు. మే 30 నాటికి రావాల్సిన రూ. 13,600 కోట్ల నిధులను కిషన్ రెడ్డి కారణంగానే ఆగిపోయాయని ఆయన మండిపడ్డారు.

### కేటీఆర్ ఆదేశాల మేరకు..

కిషన్ రెడ్డి గత నెల 21న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి, ప్రాజెక్టుకు అప్పు ఇవ్వకుండా అడ్డుకోవాలని కోరారని సీఎం ఆరోపించారు. కేటీఆర్ ఆదేశాల మేరకే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన చెప్పినట్లుగా రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. మెట్రో ప్రాజెక్టు విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని, జపాన్ నుంచి రావాల్సిన నిధులను కూడా కేంద్రం విడుదల చేయడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. అలహాబాద్ మెట్రోకు నిధులు ఇచ్చారని, ఉత్తర ప్రదేశ్‌కు ఇచ్చారని, చివరకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ అంత ఉండే వైజాగ్‌కు కూడా ఇచ్చారన్నారు. తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు.

### బాధ్యతాయుతంగా వ్యవహరించాలి..

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మెట్రో పనుల్లో జాప్యం జరిగి, అంచనా వ్యయం రూ.7 వేల కోట్లకు పెరిగిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్రం నుంచి నిధులు ఇవ్వకపోయినా కనీసం 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా రూ.40 వేల కోట్లతో మెట్రో విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. కనీసం ఎన్‌వోసీ ఇప్పిస్తే శాలువా కప్పి సన్మానిస్తామన్నారు. ఇప్పటికైనా హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కిషన్ రెడ్డి బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

## చిన్నారుల భవితకు అంగన్‌వాడీ కేంద్రాలే పునాదులు : మంత్రి సీతక్క



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ :** బాల్యంలో విద్యకు బలమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి సీతక్క అన్నారు. పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి అంగన్‌వాడీలో చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా గోల్కొండ ప్రాజెక్టు పరిధిలోని మల్లేపల్లి సెంటర్, మహాత్మా గాంధీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన "అమ్మ మాట - అంగన్‌వాడీ బాట" కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ తో కలిసి చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చిన మంత్రి, ప్రీస్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు.

## సింగరేణి మెడికల్ బోర్డును ప్రారంభించాలి : కవిత



**అక్షరటుడే, మంచిర్యాల:** తమ స్వేదాన్ని చిందిస్తూ.. ప్రాణాలను సైతం పణంగా పెట్టి భూగర్భంలో బొగ్గు వెలికితీస్తున్న సింగరేణి కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించే మెడికల్ బోర్డును వెంటనే ప్రారంభించాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా ఆమె మంచిర్యాల జిల్లాలో మాట్లాడారు. కాసిపేట మైన్ వద్ద కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వంలో సర్వసామాన్యంగా జరగాల్సిన పనులకు కూడా పోరాటం చేయాల్సి వస్తోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్నింటిలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు.

## భూములిచ్చిన రైతులకు ప్రత్యేక విమాన ప్రయాణం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రభుత్వం పలు అవసరాల కోసం ప్రజలు, రైతుల నుంచి భూమిని సేకరిస్తుంది. అందుకు పరిహారం కూడా ఇస్తుంది. అనంతరం వారిని మరిచిపోతుంది. అయితే ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఎయిర్ పోర్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక కానుక అందించింది. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి భూములిచ్చిన రైతులను ప్రత్యేక విమానంలో అధికారులు ఎక్కించారు. ఈ విమానాన్ని సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. జేవార్ నుంచి లక్నోకు తొలి వాణిజ్య విమానం చేరుకుంది. ఈ విమానంలో 172 మంది రైతులు ప్రయాణించారు. తొలి విమానంలో తమను తీసుకు వెళ్లడంపై భూములు ఇచ్చిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైలులో దోపిడీ దొంగల బీభత్సం..



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. కదులుతున్న రైలులో అర్ధరాత్రి ప్రయాణికులను దోపిడీ చేసేందుకు యత్నించారు. సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టు నుంచి కాకినాడ పోర్ట్‌కు వెళ్తుండగా ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. రైలు కాకినాడ జిల్లా బాపట్ల శివారు నల్లమడ వాగు రైల్వే వంతెన దగ్గరకు రాగానే. ఎస్3, ఎస్ 6 బోగీల్లో దొంగలు చొరబడ్డారు. నిద్రపోతున్న ఇద్దరు మహిళల నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. అయితే వారు వెంటనే లేచి అరిచారు. ప్రయాణికులు కేకలు వేయడంతో దొంగలు భయపడ్డారు. వెంటనే చైన్ లాగి కిందకు దూకారు. రైలులోనే ఉన్న రైల్వే పోలీసులు దొంగలపై కాల్పులు జరిపారు.

## పోలీసులకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఫిర్యాదు



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** తన సోదరి కనిపించడం లేదని మాజీ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో ఉండే తన సోదరి ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదని విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. సతీష్, సత్యనారాయణ, కుమారి అనే ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిలిచిన వాహన సారథి సేవలు..



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా వాహన సారథి సాఫ్ట్‌వేర్ నిలిచిపోయింది. దీంతో రవాణా శాఖ కార్యాలయాల్లో సేవలు ఆగిపోయాయి. ప్రస్తుతం ఆర్టీఏ కార్యాలయాల్లో వాహన సారథి పోర్టల్ ద్వారా సేవలు అందిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్, ఇతర సేవల కోసం ప్రభుత్వం దీనిని అందుబాటులోకి తెచ్చింది. అయితే సోమవారం ఉదయం నుంచి పోర్టల్ సరిగా పని చేయలేదు. ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనాల రిజిస్ట్రేషన్, లెర్నింగ్, పర్మినెంట్ లైసెన్స్‌ల కోసం స్లాట్ బుక్ చేసుకున్న ప్రజలు ఉదయాన్నే కార్యాలయాలకు వచ్చారు. అయితే సర్వర్ సమస్యతో గంటల తరబడి వారు క్యూలైన్‌లో నిరీక్షించారు.

## విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభించిన మంత్రి



**అక్షరటుడే, హైదరాబాద్:** వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పున : ప్రారంభం అయ్యాయి. చాలా రోజుల తర్వాత విద్యార్థులు బడిబాట పట్టారు. తొలి రోజు కావడంతో చాలా మంది పాఠశాలకు వెళ్లలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని గతంలో ప్రకటించింది. ఈ మేరకు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నగరంలోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్, మిల్క్ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్వినీ రెడ్డి , కలెక్టర్ ప్రియాంక ఆలా, డీఈవో యాదయ్య, మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్ పాల్గొన్నారు.